ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌కు బన్నీ, అక్షయ్

రాష్ట్ర యువ సెయిలర్ల ప్రతిభకు గుర్తింపు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మైసూర్‌లోని ప్రతిష్ఠాత్మక ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ సెయిలింగ్ స్కూల్‌కు రాష్ట్రానికి చెందిన బన్నీ బొంగూరు, అక్షయ్‌కుమార్ ప్రాథమికంగా ఎంపికయ్యారు. జహీరాబాద్‌లోని నిరుపేద రైతు కుటుంబానికి చెందిన బన్నీ బొంగూరు జాతీయ స్థాయి సెయిలింగ్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. ప్రస్తుతం జాతీయ రెండో ర్యాంక్‌లో ఉన్న బన్నీ.. డ్రైవర్ కుమారుడైన అక్షయ్ యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్(వైసీహెచ్)లో కోచ్ సుహేమ్ షేక్ దగ్గర శిక్షణ తీసుకుంటున్నారు. బన్నీ, అక్షయ్.. స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపిక ప్రక్రియ చివర్లో ఉన్నారు. క్లిష్టమైన ఈ దశ తర్వాత ఢిల్లీలోని ఆర్మీ సెలెక్షన్ కమిటీ నుంచి కాల్ లెటర్ రావాల్సి ఉంది. ఆర్మీ స్పోర్ట్ స్కూల్‌కు బన్నీ, అక్షయ్ ఎంపిక కావడం పట్ల కోచ్ సుహేమ్ షేక్ సంతోషం వ్యక్తం చేశారు. వీరి కంటే ముందు వైసీహెచ్ నుంచి 21 మంది సెయిలర్లు ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. కాల్ లెటర్ వచ్చిన తర్వాత మైసూర్‌లోని ఎంఈజీ సెంటర్, తృష్ణ సెయిలింగ్ క్లబ్ నుంచి ఆర్మీ కోచ్‌ల పర్యవేక్షణలో బన్నీ, అక్షయ్ శిక్షణ పొందనున్నారు. జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో సత్తాచాటి మంచి పేరు దక్కించుకునే అవకాశం లభిస్తుంది.

డబ్ల్యూఎఫ్ఐపై నిషేధం ఎత్తివేత

సాక్షి, వినేశ్, బజరంగ్‌పై వివక్ష వద్దు • యూడబ్ల్యూడబ్ల్యూ ఆదేశం

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ) విధించిన తాత్కాలిక నిషేధాన్ని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ) మంగళవారం ఎత్తివేసింది. అయితే రెజ్లింగ్ అసోసియేషన్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేసిన రెజ్లర్లు వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియాపై ఎలాంటి వివక్ష చూపించవద్దని యూడబ్ల్యూడబ్ల్యూ స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డబ్ల్యూఎఫ్ఐని ఆదేశించింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించని కారణంగా గతేడాది ఆగస్టు 23న డబ్ల్యూఎఫ్ఐపై యూడబ్ల్యూడబ్ల్యూ నిషేధం విధించింది. అయితే దీనిపై ఈనెల 9న సమావేశమైన యూడబ్ల్యూడబ్ల్యూ నిషేధంతో పాటు మిగతా అంశాలపై చర్చించింది. ఒలింపిక్స్, ఇతర డబ్ల్యూఎఫ్ఐ టోర్నీల్లో పాల్గొనే రెజ్లర్లకు ట్రయల్స్ నిర్వహించాలని వరల్డ్ బాడీ పేర్కొంది. రెజ్లింగ్ సంఘంపై పోరాడిన రెజ్లర్లు వినేశ్, సాక్షి, బజరంగ్‌పై ఎలాంటి వివక్ష ప్రదర్శించకూడదని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ స్థానంలో అధ్యక్షుడిగా ఎన్నికైన సంజయ్ సింగ్ నియామకాన్ని కేంద్ర క్రీడాశాఖ రద్దు చేస్తూ అడ్‌హాక్ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే.

సత్తాచాటిన స్విమ్మర్ శ్రీనివాస్

బండ్లగూడ: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలో ఆర్టీసీ ఉద్యోగి కొంగల శ్రీనివాస్ రజత పతకంతో మెరిశాడు. గోవాలో జరిగిన ఆరవ జాతీయ మాస్టర్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడకు చెందిన శ్రీనివాస్ సత్తాచాటాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ప్రతిభ చాటాడు. నిర్వహకులు ఆయనను అభినందిస్తూ పతకంతో పాటు సర్టిఫికేట్ ప్రదానం చేశారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో శ్రీనివాస్ పతకాలు సాధించాడు. త్వరలో జరుగనున్న అంతర్జాతీయ పోటీల్లోనూ సాధించాలని స్నేహితులు, స్థానికులతో పాటు ఆర్టీసీ అధికారులు ఆకాంక్షించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇచ్చిన ప్రోత్సాహం వల్లే తాను పతకాలు సాధిస్తున్నానని శ్రీనివాస్ పేర్కొన్నాడు.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

నెట్స్‌లో చెమటోడ్చిన భారత క్రికెటర్లు

జురెల్, సర్ఫరాజ్‌ఖాన్ అరంగేట్రానికి అవకాశం

ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు భారత్ సర్వ సన్నద్ధమవుతున్నది. ఐదు మ్యాచ్‌ల సుదీర్ఘ టెస్టు సిరీస్‌లో చెరో మ్యాచ్ గెలిచిన నేపథ్యంలో రాజ్‌కోట్ టెస్టు కీలకం కానుంది. విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లాంటి స్టార్ క్రికెటర్ల గైర్హాజరీలో యువ క్రికెటర్లు ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్‌ఖాన్ అరంగేట్రం అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. దేశవాళీ టోర్నీల్లో టన్నుల కొద్ది పరుగులు కొల్లగొడుతున్న ఈ యువ బ్యాటర్లు ఇంగ్లండ్‌పై దుమ్మురేపాలని చూస్తున్నారు. అన్నీ కలిసి వస్తే.. రాజ్‌కోట్ టెస్టులో యువ క్రికెటర్ల అరంగేట్రానికి తలుపులు తెరుచుకోవచ్చు. మరోవైపు ఇంగ్లండ్.. బజ్‌బాల్ వ్యూహంతో టీమ్‌ఇండియాను ఇబ్బంది పెట్టేందుకు అడుగులు వేస్తున్నది.

రాజ్‌కోట్: భారత్, ఇంగ్లండ్ మూడో టెస్టు మ్యాచ్‌కు రాజ్‌కోట్ సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో చెరో మ్యాచ్ గెలిచి సిరీస్ 1-1తో సమంగా ఉన్న నేపథ్యంలో మిగిలిన మూడు మ్యాచ్‌లు కీలకంగా మారనున్నాయి. విశాఖపట్నం టెస్టు తర్వాత దొరికిన విశ్రాంతిని తమకు అనుకూలంగా మలుచుకున్న ఇరు జట్ల క్రికెటర్లు మంగళవారం నుంచి ప్రాక్టీస్‌లో మునిగి తేలారు. ఎలాగైనా ఆధిక్యం సాధించాలన్న పట్టుదలతో కనిపిస్తున్న భారత్, ఇంగ్లండ్ అందుకు తగ్గట్లు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నాయి. పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశమున్న నేపథ్యంలో మరోమారు ఆసక్తిపోరుకు ఆస్కారముంది. సొంతగడ్డపై తమదే పైచేయి అనుకున్న టీమ్‌ఇండియాకు ఇంగ్లండ్ బజ్‌బాల్ వ్యూహంతో దీటైన పోటీనిస్తున్నది. దీనికి తోడు స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లేకపోవడం టీమ్‌ఇండియాను ఇబ్బందులకు గురి చేస్తున్నది. దీంతో దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న రజత్ పాటిదార్, సర్ఫరాజ్‌ఖాన్, ధ్రువ్ జురెల్, దేవదత్ పడిక్కల్ లాంటి యువ క్రికెటర్లు అవకాశం ఎదురుచూస్తున్నారు. సీనియర్ల గైర్హాజరీలో సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు. ఇప్పటికే విశాఖ టెస్టు ద్వారా రజత్ పాటిదార్ అరంగేట్రం చేయగా, రాజ్‌కోట్ టెస్టులో ధ్రువ్ జురేల్, సర్ఫరాజ్‌ఖాన్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. దీంతో జట్టు అనుభవజ్ఞులైన రోహిత్‌శర్మ, బుమ్రా, జడేజాతో కలిసి యువ క్రికెటర్లు బరిలోకి దిగనున్నారు. మంగళవారం ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌కు శుభ్‌మన్ గిల్ హాజరుకాలేదు. విశాఖ టెస్టులో గాయపడ్డ గిల్..ఇంకా పూర్తిగా కోలుకోలేదని తెలిసింది. ఇదిలా ఉంటే జట్టులో చోటు ఆశిస్తున్న ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ చాలాసేపు మైదానంలో గడిపారు. స్లిప్‌లో క్యాచ్‌లు ప్రాక్టీస్ చేయడంతో పాటు సుదీర్ఘంగా నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తూ కనిపించారు. మరోవైపు మైదానంలోకి వచ్చి రావడంతోనే కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో కలిసి కెప్టెన్ రోహిత్‌శర్మ పిచ్‌ను సమగ్రంగా పరిశీలించాడు. మ్యాచ్‌కు మరో రోజే మిగిలున్న నేపథ్యంలో పిచ్ స్పిన్‌కు సహకరిస్తుందా లేక బ్యాటింగ్‌కు ఆ అన్నదానిపై కోచ్‌తో కలిసి రోహిత్ సమాలోచనలు చేశాడు. ఆ తర్వాత క్యాచింగ్ ప్రాక్టీస్‌తో పాటు బ్యాటింగ్ చేశాడు. వైస్ కెప్టెన్ బుమ్రా మంగళవారం జట్టుతో చేరాడు. గాయం నుంచి కోలుకుంటున్న ఆల్‌రౌండర్ జడేజా..తుది జట్టులోకి వస్తాడా అన్నది ప్రశ్నగా మారింది. పిచ్‌పై పూర్తి అవగాహన ఉన్న ఈ లోకల్ బాయ్ చేరికతో టీమ్ ఇండియాకు మరింత బలం చేకూరనుంది.

రసెల్ మెరుపుల్

• ఆసీస్‌పై విండీస్ విజయం

పెర్త్: ఆస్ట్రేలియాతో మూడో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్‌కు ఓదార్పు విజయం దక్కింది. మంగళవారం జరిగిన ఆఖరి పోరులో విండీస్ 37 పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించింది. తొలుత అండ్రూ రస్సెల్(29 బంతుల్లో 71, 4ఫోర్లు, 7 సిక్స్‌లు), రూథర్‌ఫోర్డ్(67 నాటౌట్) అర్ధసెంచరీలతో విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 220/6 స్కోరు చేసింది. 79 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన విండీస్‌ను రస్సెల్, రూథర్‌ఫోర్డ్ ఆదుకున్నారు. ముఖ్యంగా రస్సెల్ తన ఇన్నింగ్స్‌లో ఏడు భారీ సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో దుమ్మురేపాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 139 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. బార్ట్‌లెట్ (2/37) రెండు వికెట్లు తీశాడు. లక్ష్యఛేదనలో ఆసీస్ 183/5 స్కోరుకు పరిమితమైంది. వార్నర్ (81) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఆఖర్లో డేవిడ్ (41 నాటౌట్) పోరాడినా ఆసీస్ గెలుపు దక్కలేదు. షెఫర్డ్, రోస్టన్ చేజ్ రెండేసి వికెట్లు తీశారు. రస్సెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

స్నూకర్ చాంప్ సుశీల్ జోడీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: యువ ప్లేయర్లను ప్రోత్సహించేందుకు డెస్టినేషన్ పూల్ అకాడమీ నిర్వహించిన టీమ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో సుశీల్, అమన్ జోడీ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో సుశీల్, అమన్ ద్వయం 3-0 ఫ్రేమ్స్‌తో బ్రాండన్, రవీష్ జంటపై గెలిచింది. దివంగత ప్లేయర్ అరవింద్ పేరిట సాగిన ఈ టోర్నీలో 100కు పైగా జాతీయ, రాష్ట్ర స్నూకర్ ప్లేయర్లు పోటీపడ్డారు. స్నూకర్ నేర్చుకోవాలనే యువ ప్లేయర్లను ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా డెస్టినేషన్ పూల్ ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. విజేతలకు రాష్ట్ర క్యూ స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అప్పారావు నగదు బహుమతి ట్రోఫీలు అందజేశారు.

దత్తాజీరావు ఇకలేరు

న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ దత్తాజీ రావు గైక్వాడ్ తుది శ్వాస విడిచారు. 1950 దశకంలో ఓ వెలుగు వెలిగిన దత్తాజీరావు మంగళవారం బరోడాలో కన్నుమూశారు. 1952 నుంచి 1961 వరకు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 95 ఏండ్ల గైక్వాడ్ చూడచక్కని కవర్‌డ్రైవ్‌లకు పెట్టింది పేరుగా నిలిచారు. ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ గైక్వాడ్ కొట్టే షాట్లకు క్రికెట్ ఫ్యాన్స్ ఫిదా అయ్యేవారు. 2016లో దీపక్ శోధన్ తర్వాత జీవించి ఉన్న అత్యధిక వయసు క్రికెటర్‌గా దత్తాజీరావు నిలిచారు. గైక్వాడ్ కొడుకు అన్షుమన్ గైక్వాడ్..టీమ్‌ఇండియాకు 40 టెస్టుల్లో ఆడాడు.

మందన @ 4

దుబాయ్: టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ స్మృతి మందన వన్డే ర్యాంకింగ్స్‌లో నాలుగో ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో మందన 696 పాయింట్లతో రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని నాలుగులో నిలిచింది. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో మందన 31.50 సగటుతో 63 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాటర్ నటాలీ స్కీవర్(807) నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ(654) నాలుగో ర్యాంక్‌లో ఉండగా, సోఫీ ఎక్లస్టోన్(746) అగ్రస్థానంలో ఉంది.

రాణించిన రచిన్

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 220/6

హామిల్టన్ (న్యూజిలాండ్): దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య రెండో ఆసక్తికరంగా సాగుతున్నది. ఇప్పటికే రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న కివీస్..సొంతగడ్డపై సఫారీలకు పరీక్ష పెడుతున్నది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా మంగళవారం తొలి రోజు ఆట ముగిసేసరికి 6 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. ర్యువాన్ డీ స్వార్ట్ (55) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర(3/33) రాణించాడు. రచిన్ తన స్పిన్ మాయాజాలంతో హమ్జా (20), బెడింగ్‌హామ్ (39), పీటర్సన్(2)ను పెవిలియన్ పంపాడు. స్వార్ట్, వాన్‌బెర్గ్ (34 నాటౌట్) ప్రస్తుతం క్రీజులో ఉన్నారు.

గంటకు 623 కిలోమీటర్ల వేగంతో..

పాత రికార్డును అధిగమించిన చైనా రైలు మాగ్లెవ్

బీజింగ్, ఫిబ్రవరి 13: చైనాలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. గంటకు *623* కిలోమీటర్ల *(387* మైళ్ల*)* వేగంతో దూసుకెళ్తూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే రైలుగా రికార్డుల కెక్కిన మాగ్లెవ్ (మాగ్నెటికల్లీ లెవిటేటెడ్) రైలు ఇప్పుడు తన రికార్డును తానే బద్దలు కొట్టింది. కొత్త మాగ్లెవ్ రైలు గంటకు *623* కిలోమీటర్ల కంటే అధిక వేగంతో ప్రయాణించినట్టు చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ (కాసిక్) వెల్లడించింది. తక్కువ పీడనంతో కూడిన కేవలం *2* కి.మీ. పొడవైన ట్యూబ్‌లో జరిపిన పరీక్షల్లో ఈ రైలు పాత రికార్డును అధిగమించినట్టు ప్రకటించింది. అయితే ఇది కచ్చితంగా ఎంత వేగాన్ని అందుకున్నదన్న విషయాన్ని గోప్యంగా ఉంచినప్పటికీ తాజా పరీక్షలో గణనీయ పురోగతి సాధించామని, అల్ట్రా-ఫాస్ట్ హైపర్‌లూప్ రైలు తక్కువ పీడనం కలిగిన ట్యూబ్‌లో ప్రయాణిస్తున్నప్పుడు స్థిరమైన లెవిటేషన్‌ను అందుకోవడం ఇదే తొలిసారి అని 'కాసిక్' వివరించింది. చైనా త్వరలో విమాన వేగంతో నడిచే రైలును తయారు చేస్తుందని దీని అర్థమని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక పేర్కొన్నది. ఈ రైలు మాగ్లెవ్ సాంకేతికతతో పనిచేస్తుంది. ఈ టెక్నాలజీ విద్యుదయస్కాంత శక్తితో రైలును నడిపించడంతోపాటు రైలును ట్రాక్‌పై గాలిలో తేలియాడేలా చేసి ఘర్షణను తగ్గిస్తుంది. ఎయిర్ రెసిస్టెన్స్‌ను తగ్గించేందుకు తక్కువ పీడనంతో ప్రత్యేకంగా రూపొందించిన ట్యూబ్ ద్వారా ప్రయాణించడం ద్వారా ఈ రైలు మరింత వేగాన్ని అందుకుంటుంది.

అమెరికా అధ్యక్ష బాధ్యతలకు సిద్ధమే

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష బాధ్యతలను చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ఆ దేశ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ స్పష్టం చేశారు. తన సామర్థ్యం గురించి తన చుట్టూ ఉన్న వారికి బాగా తెలుసని ఆమె చెప్పారు. ఇటీవల 'వాల్ స్ట్రీట్ జర్నల్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు నేను సిద్ధం. అందులో ఎలాంటి సందేహం లేదు. నన్ను గమనించిన ప్రతి ఒక్కరికీ నా సామర్థ్యం గురించి తెలుసు' అని ఆమె అన్నారు. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ (81) వయసు, జ్ఞాపకశక్తిపై విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో కమలా హారిస్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

మొబైల్ చోరీ చేస్తే రూ.25 వేలు జీతం!

అహ్మదాబాద్, ఫిబ్రవరి 13: వారిద్దరూ రోజువారీ కూలీలు. అయితే నెలకు రూ.25 వేల జీతంతో కొందరు వారిని నియమించుకున్నారు. వారు చేయాల్సిందల్లా రద్దీగా ఉన్న ప్రదేశాల్లో ఐ ఫోన్‌లు, ఇతర మొబైల్స్ అపహరించడమే. దానికి వారికి అనుభవం లేకపోయినా ఫర్వాలేదంటూ ముఠాను నడుపుతున్న నిర్వాహకులే 45 రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. ఇలాంటి ముఠా గుట్టును రట్టు చేశారు. అహ్మదాబాద్ సిటీ క్రైం పోలీసులు. అవినాశ్ మహతో, శ్యాం కుర్మి అనే ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.29 లక్షల విలువైన 58 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అవినాశ్ సోదరుడు పింటూ మహతో, రాహుల్ మహతోలు నియమించి దొంగతనాల్లో శిక్షణ ఇచ్చి వారి ద్వారా మొబైల్స్ చోరీ చేయించేవారు. వారు తెచ్చిన మొబైల్స్‌ను అన్‌లాక్ చేసి నేపాల్, బంగ్లాదేశ్‌లకు పంపేవారు. చోరీ చేసిన మొబైళ్లలో ఐఫోన్‌లు అధికంగా ఉన్నాయి.

నేరస్థుడిపై 50 పైసలు రివార్డు!

జైపూర్, ఫిబ్రవరి 13: సాధారణంగా 'వాంటెడ్' లిస్టులో ఉన్న నేరస్థులను పట్టుకుంటే కొన్ని వేలో, లక్షల రూపాయలో రివార్డుగా ఇవ్వడం చూస్తుంటాం. అయితే రాజస్థాన్ పోలీసులు బుధవారం ఒక నిందితుడిని పట్టుకుంటే ప్రకటించిన బహుమతి ఎంతో తెలుసా అక్షరాలా '50 పైసలు'. ఇది నిజం. సింఘనా పోలీస్ స్టేషన్‌లో ఆయుధాల చట్టం కింద కేసు నమోదై తప్పించుకు తిరుగుతున్న యోగేశ్ మేఘ్వాల్‌ను పట్టుకుంటే కనీసం వాడుకలో కూడా లేని 50 పైసలు రివార్డుగా ఇస్తామంటూ జుంజును పోలీస్ సూపరింటెండెంట్ దేవేంద్ర విష్ణోయ్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. యోగేశ్‌ను పట్టుకున్నా, అతని గురించి సమాచారం ఇచ్చినా ఈ రివార్డు ఇస్తామని చెప్పారు. 'ఒక నేరస్థుడి విలువ, హోదా సమాజంలో 50 పైసలు మాత్రమే అని ప్రజలకు ఒక స్పష్టమైన, సానుకూల సందేశం ఇవ్వడానికే ఈ ప్రకటన చేశాం' అని ఎస్పీ తెలిపారు.



కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

జనవరి నుంచి ఇప్పటికే ముగ్గురు బలవన్మరణం

కోటా(రాజస్థాన్), ఫిబ్రవరి 13: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండేండ్లుగా జేఈఈకి ప్రిపేర్ అవుతున్న విద్యార్థి ఫలితాలు వచ్చిన మరుసటి రోజైన మంగళవారం తన హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన శుభ్ చౌదరి (16) రెండేండ్లుగా జేఈఈ-మెయిన్స్‌కు సిద్ధమవుతున్నాడు. కోటాలోని జవహర్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. సోమవారం జేఈఈ మెయిన్ కీ వచ్చింది. దానిని చూసుకున్న శుభ్.. ఆశించిన స్థాయిలో మార్కులు రాలేదని మనస్తాపానికి గురయ్యాడు. హాస్టల్‌లోని తన గదికి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు శుభ్‌కు ఫోన్‌చేయగా, ఎంతకూ స్పందించక పోవడంతో వారు హాస్టల్ వార్డెన్‌ను అలర్ట్ చేశారు. పోలీసుల సాయంతో విద్యార్థి గది తలుపులు బద్దలు కొట్టి చూడగా, సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా శుభ్ కనిపించాడు. ఎడ్యుకేషన్ హబ్‌గా పేరుగాంచిన కోటాలో జనవరి నుంచి ఇప్పటివరకు ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ఏడాది 26 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

రష్యా వాంటెడ్ లిస్టులో ఎస్టోనియా ప్రధాని

మాస్కో, ఫిబ్రవరి 13: ఎస్టోనియా ప్రధానమంత్రి కాజా కల్లాస్‌ను రష్యా వాంటెడ్ లిస్టులో చేర్చింది. నేరారోపణలకు సంబంధించి అంతర్గత మంత్రిత్వశాఖ కోరిన వ్యక్తుల రిజిస్టర్‌లో కల్లాస్ పేరు మంగళవారం కనిపించింది. సోవియట్ కాలం నాటి రెండో ప్రపంచ యుద్ధ స్మారకాలను తొలగించేందుకు కల్లాస్ ప్రయత్నాల నేపథ్యంలో రష్యా ఈ నిర్ణయం తీసుకున్నది. అంతర్గత మంత్రిత్వశాఖ ఒక విదేశీ నాయకుడి పేరు వాంటెడ్ లిస్టులో పెట్టడం ఇదే తొలిసారి. కల్లాస్ ఉక్రెయిన్‌కు బలమైన మద్దతుదారుగా ఉన్నారు. కాగా, ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో కల్లాస్ పేరును వాంటెడ్ లిస్టు పెట్టడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఎస్టోనియా.. నాటో సభ్య దేశంగా ఉన్న సంగతి తెలిసిందే.

ఏఐ హోలోగ్రాంతో వివాహం!

పెండ్లాడనున్న స్పానిష్ ఆర్టిస్ట్.. ప్రపంచంలో ఇదే తొలిసారి!

ఆమ్‌స్టర్‌డామ్, ఫిబ్రవరి 13: అధునా తన సాంకేతిక ప్రపంచంలో ఏఐ ఒక అద్భుతం. ఇది విద్యార్థుల హోంవర్క్ నుంచి ఇంజినీరింగ్ నిపుణుల కోడింగ్ వరకు అన్ని పనులు చకచకా చేసిపెట్టడమే కాదు.. వర్చువల్ మనుషులనూ సృష్టిస్తున్నది. ఇంకా విచిత్రమేమిటంటే ఆ ఏఐ క్రియేటెడ్ క్యారెక్టర్స్‌తో కొందరు ప్రేమలో మునిగి తేలుతున్నారు. స్పానిష్‌కి చెందిన ఆర్టిస్ట్ అలీసియా ఫ్రేమిస్ ఈ కోవకు చెందినవారే. ఈమె ఏకంగా ఏఐ క్రియేటెడ్ హోలిగ్రాఫిక్ పార్ట్‌నర్‌ను పెళ్లాడుతున్నట్టు ప్రకటించింది. కేవలం ఇదేదో వైరల్ అవ్వడానికి మాత్రమే అనుకొంటే మీరు పొరబడ్డట్టే. ఆమె ఏఐ హోలోగ్రామ్‌తో వివాహం కోసం నెదర్లాండ్స్‌లోని రోటెర్‌డామ్‌లో వేదికను కూడా సిద్ధం చేసుకొన్నది. పెండ్లి బట్టలు డిజైన్ చేయించుకొన్నది. తన భాగస్వామి పేరు ఐలెక్స్ అని అలీసియా సోఫల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో వెల్లడించింది. ఈ వీడియోలో వీరిద్దరూ కలిసి భోజనం చేస్తున్నారు. అనంతరం అలీసియా ఫ్రిజ్ వైపు వెళ్తుండగా.. ఐలెక్స్ పాత్రలు కడుగుతూ కనిపించారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక అందరి భవిష్యత్తు ఇలాగే ఉండబోతున్నదని ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. వర్చువల్ మనుషులతో వైవాహిక బంధం కొన్నాళ్లే బాగుంటుంది.. భౌతిక ప్రపంచంలో మనకు తోడుగా ఉండేందుకు నిజమైన హ్యూమన్ పార్ట్‌నర్ ఉండాల్సిందే అంటూ మరొకరు తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

ఏఐ బాయ్‌ఫ్రెండ్స్!



బీజింగ్: చైనా అమ్మాయిలు కృత్రిమ మేధ *(*ఏఐ*)* బాయ్‌ఫ్రెండ్స్ వెంటపడుతున్నారు. సామాన్య బాయ్‌ఫ్రెండ్స్ అయితే అప్పుడప్పుడు కసురుకుంటారని, ఏఐ బాయ్‌ఫ్రెండ్స్ అయితే నిరంతరం తమకు వెన్నుదన్నుగా ఉంటారని చెప్పున్నారు. రొమాంటిక్ సంభాషణలకైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని అంటున్నారు. వీరంతా 'గ్లో' అనే చాట్‌బాట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు నచ్చిన బాయ్‌ఫ్రెండ్‌ను ఎంచుకుని ఎంజాయ్ చేస్తున్నారు. పాప్ స్టార్స్, యుద్ధ వీరులు, సీఈఓలు వంటి అనేక క్యారక్టర్స్ ఈ యాప్‌లో ఉన్నాయి. వయసు, గర్తింపు, అలవాట్లు, పాటించే విలువలు వంటి ఆధారంగా ఈ బాయ్‌ఫ్రెండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

భారత్-యూఏఈ దోస్తీ జిందాబాద్

• ప్రవాస భారతీయులతో మోదీ
• నేడు అబుదాబిలో అతిపెద్ద హిందూ ఆలయం ప్రారంభం

అబుదాబి: యూఏఈ-భారత్ మధ్య భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అబుదాబిలోని జబేల్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో మంగళవారం జరిగిన అహ్లాన్ మోదీ కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 'మీ రంతా యూఏఈలోని వ